కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పాదయాత్ర


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మల్కాజిగిరి: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మల్కాజిగిరి నియోజకవర్గంలో ఈ నెల 5 వరకు పాదయాత్ర చేపడుతున్నామని నియోజకవర్గ ప్రముఖ్ ఎస్ రమేశ్‌గౌడ్, సహప్రముఖ్ పీ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. పద్మావతి ఫంక్షన్ హాల్‌లో కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, శ్రవణ్‌తో కలిసి అందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన 6 అబద్ధాలు.. 66 మోసాలుగా సాగిందన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని, మైనార్టీ ఓటర్లను ఆకర్షించేందుకు వక్ఫ్ భూములు 750 ఎకరాలు ఉన్నాయని ప్రచారం చేశారన్నారు.హైడ్రా పేరిట నిరుపేదలకు నోటీసులు ఇచ్చారని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చెప్పేందుకు చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. నాయకులు బాలచందర్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, సోమా శ్రీనివాస్, నరహరి తేజ, మురళీకృష్ణ, అజయ్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ నార్త్ అల్వాల్ సొసైటీస్ అసోసియేషన్ సభ్యులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అల్వాల్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని, మంగాపూర్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని, డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్య పరిష్కరించాలని, రోడ్డు మరమ్మతులు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. ఎమ్మెల్యే స్పందించి రానున్న బడ్జెట్ కేటాయింపులో ప్రతిపాదనలకు


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ఆమోదం లభిస్తుందని తెలిపారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నార్త్ అల్వాల్ సొసైటీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: నగర అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ పిలుపునిచ్చారు. 24వ డివిజన్‌లో సీసీ రోడ్డు, హైమాస్ట్ లైట్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం 24, 25, 26 డివిజన్లలో నిర్వహించిన ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుప్పల్ నగర పాలక సంస్థను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు గుర్రాల వెంకటేశ్ యాదవ్, జక్క పద్మ జయరాములు, పొద్దుటూరు శోభారాణి వెంకటేశ్‌గుప్తా, బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి


ఉప్పల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

ఉప్పల్: యాత్రల పేరిట టూరిస్టుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేసి పారిపోయిన శ్రీ గాయత్రి టూర్స్ అండ్ ట్రావెలర్స్ నిర్వాహకులపై చట్ట పరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ఆదివారం ఉప్పల్ పోలీస్ స్టేషన వద్ద బ్యానర్ పట్టి నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ కల్యాణపురి కాలనీలో నివాసముండే భరత్ కుమార్ మానస సరోవరం, ఇతర టూర్స్ పేరిట సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహించి వందలాది మంది యాత్రికుల వద్ద రూ. కోట్లు వసూలు చేసి పారిపోయరన్నారు. కాగా గతంలో ఇదే కేసులో నిర్వాహకుడు భరత్‌కుమార్‌ను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. బెయిల్‌పై వచ్చిన సదరు వ్యక్తి తిరిగి అదేవిధంగా వసూళ్లకు పాల్పడుతున్నాడని బాధితులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మాలల సింహగర్జనకు తరలివెళ్లిన నాయకులు


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మల్కాజిగిరి: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన మాలల సింహగర్జన బహిరంగ సభకు మల్కాజిగిరి, ఆనంద్‌బాగ్ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా తరలివెళ్లారు. అంతకుముందు ఆనంద్‌బాగ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెళ్లినవారిలో సానాది శంకర్, చంద్రశేఖర్, శ్యామ్, ఇందిరాప్రియదర్శిని, నిర్మల, లక్ష్మి, విజయలక్ష్మి, కుమార్, యాదగిరి, సత్యనారాయణ ఉన్నారు.

ఓల్డ్ రామంతాపూర్ నుంచి..

రామంతాపూర్ : ఓల్డ్ రామంతాపూర్ మాల సేవా సంఘం సభ్యులు సింహగర్జన సభకు తరలివెళ్లారు. బండారి అనిల్‌కుమార్, బాబురావు, బండారి శివకుమార్, సతీశ్, భాస్కర్, అఖిల్ తదితరులు ఉన్నారు.

అల్వాల్ నుంచి..

అల్వాల్: మాలల సింహగర్జన సభకు అల్వాల్ నుంచి నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అంతకుముందు ఓల్డ్ అల్వాల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శరన్‌గిరి, వెంకట్రావు, రాజు, శ్రావణ్, శ్రీను, యాదగిరి, రాజశేఖర్, అరుణ్, క్రాంతి, అరుంధర్, నర్సింగ్, రాము, సాగర్, ఆనంద్, రామానుజం, బాలరాజు, రమేశ్, ఆనందరావు తదితరులు ఉన్నారు. అలాగే గౌతంనగర్ నుంచి కూడా తరలివెళ్లారు. అనిల్, రవి, నరహరిరావు, రామ్మోహన్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

బోడుప్పల్ నుంచి..

బోడుప్పల్: మాలల సింహగర్జనకు బోడుప్పల్ నుంచి నేతలు తరలివెళ్లారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్, మాజీ వార్డు సభ్యులు బొమ్మక్ రమేశ్, నేతలు జక్కల జయరాములు, గోపు రాము, శత్రుఘ్న, భిక్షపతి తదితరులు ఉన్నారు.


నేరేడ్‌మెట్ చౌరస్తాలో అన్నదానం చేస్తున్న బాల మల్లయ్య తదితరులు

గంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండేళ్లుగా అన్నదానం

మౌలాలి : శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండేళ్లుగా ప్రతి ఆదివారం అన్నదానం చేస్తున్నామని నిర్వహకుడు బిర్రు బాల మల్లయ్య తెలిపారు. నేరేడ్‌మెట్ చౌరస్తాలో సుమారు 400 మందికి ఆదివారం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆయన కుమారులు భరద్వాజ్, వెంకటేశ్, భువన్ సుందర్, హరిసుందర్, నారాయణరెడ్డి, కృష్ణ, దుర్గారెడ్డి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

బాల మల్లేశ్ మృతి తీరని లోటు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- బాలమల్లేశ్ అంత్యక్రియలకు హాజరు
- నివాళులర్పించిన శ్రేణులు, అభిమానులు, బంధుమిత్రులు


బాలమల్లేశ్ అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు, శ్రేణులు

అల్వాల్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. బాల మల్లేశ్ మృతి చెందడం పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కే. సాంబశివరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. యాప్రాల్‌లోని బాల మల్లేశ్ పార్థీవదేహానికి ఆదివారం నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. అలాగే యప్రాల్‌లో బాల మల్లేశ్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీపీఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, రాష్ట్ర రాజకీయ విశ్లేషకులు మల్లెపల్లి లక్ష్మయ్య, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బోస్, ఈటీ. నర్సింహ, కార్యవర్గ సభ్యులు ఛాయాదేవి, పల్లా నర్సింహారెడ్డి, నెల్లికంటి సత్యం, విజయలక్ష్మి, రవీంద్రాచారి, పాలమాకులు జంగయ్య, సాయిలుగౌడ్, మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యులు దామోదర్‌రెడ్డి, సృజన్ కుమార్, స్టాలిన్, అంజయ్యనాయక్, ఏఐవైఎఫ్ నాయకులు ధర్మేంద్ర, సత్యప్రసాద్, లక్ష్మణ్, అన్వర్, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, మాస్ లైన్ నుంచి రమ, సీపీఐఎంఎల్ నాయకులు గోవర్ధన్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నేతలు, ప్రజా సంఘాల నాయకులు, ఇతర పార్టీ నాయకులు, నేతలు పాల్గొన్నారు.

యాప్రాల్‌తో ఐదు దశాబ్దాల అనుబంధం..



ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీకి అంకితభావంతో చివరి శ్వాస వరకు పనిచేసిన బాల మల్లేశ్ ప్రస్థానం ముగిసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని యాప్రాల్‌తో బాల మల్లేశ్‌కు ఐదు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉంది. ఇన్నాళ్లు తమ కోసం పోరాడిన మల్లేశ్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమయాత్రతో యాప్రాల్ ప్రధాన రహదారులన్నీ ఎరుపుమయంగా మారాయి. ఎంతోమంది నాయకులు వస్తూ.. పోతూ ఉంటారు. కానీ ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పాటుపడే నాయకులు కొందరే ఉంటారని వారు గుర్తు చేసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మౌలాలి : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. కాకతీయనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకోగా ఆమె పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడిగా బాలస్వామి, సెక్రటరీగా సీతారామస్వామి, ట్రెజరర్‌గా రాంబాబు, అడ్వైజర్‌గా రామచంద్రంరావు, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కాలనీలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు.

సైబర్ క్రైం నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మౌలాలి : వినాయక్‌నగర్ డివిజన్ ఈస్ట్ కాకతీయనగర్‌లో నేరేడ్‌మెట్ సీఐ సందీప్ సారథ్యంలో ఆదివారం సైబర్ క్రైం నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కాల్ చేసి ఆధార్, ఓటర్ ఐడీ, ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేశ్, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

పారమిత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శిబిరం

బోడుప్పల్: శ్రీసాయి ఎన్‌క్లేవ్ కాలనీలో పారమిత హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ ప్రారంభించారు. అనంతరం పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు ఆకుల సత్యనారాయణ, సలహాదారులు అంజయ్య, కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సంజీవరావు, కోశాధికారి విద్యాసాగర్ పాల్గొన్నారు.

అన్నదానం

గౌతంనగర్: అమావాస్యను పురస్కరించుకుని గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధుసూదననగర్‌లో మల్కాజిగిరి జైన్ మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు


అరెస్టు చూపిస్తున్న పోలీసులు

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లికి చెందిన ఆనంద్ నహాక్ (26) ఒడిసా బార్డర్ నుంచి అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి ఉప్పల్, మల్లాపూర్‌లో విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం మల్లాపూర్‌లో మాటు వేసి ఆనంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 1.28 గ్రాముల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పీ నరేశ్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

'రహదారులపై ఆటంకాలు–ప్రత్యామ్నాయాలు'పై సదస్సు


మాట్లాడుతున్న వక్తలు

కాప్రా: తెలంగాణ సిటిజన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లోని రౌండ్ బిల్డింగ్ లయన్స్ క్లబ్ హాల్‌లో 'రహదారులపై ఆటంకాలు–ప్రత్యామ్నాయాలు' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రహదారులపై వివిధ మతాలకు చెందిన ప్రార్థన మందిరాలు అడ్డుగా ఉండడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాటిని సుప్రీంకోర్టు డైరెక్షన్‌లో పాలకులు వారిని ఒప్పించి తొలగించేలా చూడాలన్నారు. మతం అనేది వ్యక్తిగతంగా ఉన్నంతవరకు ఎలాంటి సమస్యలు రాలేదని, దేవుడిని రోడ్డుపైకి తీసుకువచ్చిన తర్వాతే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో గిరీశ్, గంజి ఈశ్వర లింగం, సైకిలాబ్ బాబు, టీ రమేశ్, జ్యోతి, మల్లేశం, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

నాచారం ఎరుకల బస్తీలో కాంగ్రెస్ నేతల పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న బందారం శ్రీకాంత్‌గౌడ్


మల్లాపూర్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నాచారం డివిజన్ పరిధిలోని ఎరుకల బస్తీలో ఆ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బందారం శ్రీకాంత్‌గౌడ్ ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేత, మహంకాళి ఆలయ చైర్మన్ జీ కృష్ణారెడ్డి, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మహేశ్ యాదవ్, బండారి రఘు, భద్రయ్య, ప్రవీణ్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, మధుగౌడ్, సునీల్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, క్రాంతి, బాలు యాదవ్, మహిళా అధ్యక్షురాలు ఉమ, భరతమ్మ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం, మానసికోల్లాసం



ఉప్పల్: క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఉప్పల్‌లోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ–1 ప్రిన్సిపాల్ ఈవీ రమణ అన్నారు. పాఠశాలకు సంబంధించిన 45వ వార్షిక స్పోర్ట్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. ఎన్‌సీసీ విద్యార్థులతో పాటు పాఠశాలకు సంబంధించిన కృష్ణ, గోదావరి, గంగ, బ్రహ్మపుత్ర సదనాలకు చెందిన విద్యార్థులు ప్రత్యేక కవాతు నిర్వహించారు. వివిధ క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించిన విద్యాలయ విద్యార్థులు ఒలంపిక్ టార్చ్‌రన్ చేపట్టారు. బెలూన్ బ్లాస్టింగ్, రోప్ స్కిప్పింగ్, తైక్వాండో ప్రదర్శన సహా వివిధ పోటీలతో స్పోర్ట్స్ డే ఆసక్తికరంగా సాగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బతుకమ్మ నృత్యం ప్రదర్శించారు. పీఈటీ ఎం.కరుణాకర్‌రెడ్డి పాఠశాలకు సంబంధించిన క్రీడా నివేదికను సమర్పించారు. బోధన, బోధనేతర సిబ్బందితో పాటు తైక్వాండో శిక్షకుడు పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


మనోజ్ (ఫైల్)

ఉప్పల్: లారీ బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పస్తాలా గ్రామానికి చెందిన అంజయ్య బతుకుదెరువు కోసం 18 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చి రామంతాపూర్‌లో నివాసముంటున్నాడు. ఆయన కుమారుడు శంగాల మనోజ్ (20) బార్బర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తన బైక్‌పై స్నేహితుడు వినయ్‌తో కలిసి గోల్నాక నుంచి ఉప్పల్ వైపు వస్తున్నారు. ఉప్పల్ డీఎస్ఎల్ మాల్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన మనోజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న వినయ్‌కు గాయాలయ్యాయి. దీంతో వినయ్‌ను ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం


పాల్గొన్న 2007-08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

మల్లాపూర్: మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల 2007–08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. టీచర్లు రంగారెడ్డి, చిక్క నర్సింహ, విమల, మంజుల, దేవి, గీత, సునందా, నిర్వాహకులు శివకుమార్, నరేశ్, శ్రీరాములు, పుణ్యవతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ ఐ ఫోకస్ ఆధ్వర్యంలో సుప్రభాతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి

ఉప్పల్: ఉప్పల్ ఐ ఫోకస్ ఆధ్వర్యంలో ఆదివారం సుప్రభాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత, మహిళల్లో ఆత్మవిశ్వాసం, ఉద్యోగుల్లో సమర్థత, యువతలో చైతన్యం, వ్యాపారుల్లో నైపుణ్యం సమాజ సాధికారితకు కృషి చేస్తున్న ఐ ఫోకస్ సేవలు ఎంతో గొప్పవన్నారు. ఈ ప్రయాణం ఇలాగే కొనసాగాలని, మరెందరికో చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాచారం గురుకుల హాస్టల్లో నాసిరకం భోజనం

మల్లాపూర్: నాచారం చౌరస్తాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నాసిరకం భోజనం పెడుతున్నారని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వంటగదిని ఆదివారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. భోజనం సరిగా పెట్టడం లేదని, పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని గురుకుల హాస్టళ్లలో నాణ్యమైన భోజనం లభించేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. విద్యార్థి నేతలు మేడ్చల్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింగ్, ఉప్పల్ బీఆర్ఎస్‌వీ నాయకుడు కృష్ణ, ప్రశాంత్‌గౌడ్, దినేశ్, సంతోష్, స్థానిక బీఆర్ఎస్ నేతలు విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్నగౌడ్ పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి



కాప్రా: జ్ఞానమాల టీమ్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం మహనీయులను స్మరించుకుంటూ నివాళులర్పిస్తున్నారు. ఇందులో భాగంగా జమ్మిగడ్డలో జ్ఞానమాల టీమ్ ప్రతినిధులు ఆదివారం మహాత్మా జ్యోతిరావుబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేత శరత్‌చంద్ర, జ్ఞానమాల టీమ్ ప్రతినిధులు తాడూరి గగన్‌కుమార్, ఎస్ఏ రహీం, వెంకటయ్య, కొండల్, నగేశ్, బాబు, ఉపేందర్, శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

7న ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలి



మల్లాపూర్: ఈ నెల 7న చేపట్టనున్న ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య పిలుపునిచ్చారు. ఆటో జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన సంబంధిత పోస్టర్‌ను నాచారం హెచ్‌ఎంటీనగర్‌లో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 9న జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆటో డ్రైవర్ల సమస్యలపై చర్చించాలన్నారు. టీఏడీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, టీయూసీఐ గ్రేటర్ అధ్యక్షులు లింగం గౌడ్, శాతం రమేశ్, హైమాద్ బాయ్, రామాంజనేయులు, ఆయి, మున్నా యాదవ్, కుమార్, ఉపేందర్ ఉన్నారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి



రామంతాపూర్ : మహాత్మా జ్యోతిబాపూలే సేవా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో అమరుడైన కానిస్టేబుల్ పోలీస్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సత్యదేవుని ఆలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు బుర్ర మహేందర్, ఇటికల వెంకటేశ్, ముత్తినేని జగదీశ్, వెంకటేశ్, దీటి మల్లయ్య, లక్ష్మణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మల్కాజిగిరి: ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మల్కాజిగిరి మండలపరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెన్యువబుల్ ఎనర్జీ సోర్సెస్ అంశంపై ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఎంఈవో అంబటి సురేశ్ జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థిని తేజస్వినికి ప్రథమ బహుమతి, మౌలాలి ప్రభుత్వోన్నత, జడ్పీ పాఠశాల నేరేడ్‌మెట్ విద్యార్థినులు వేలంకిని, అంజలికి ద్వితీయ బహుమతులు అందజేశారు. గెలుపొందిన విద్యార్థులు సోమవారం జరిగే జిల్లాస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, ఆంజనేయులు, శ్రీధర్, పద్మ, ప్రవీణ్, రమేశ్, కిరణ్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీవన శిష్య బృందం నిర్వహించిన భరతనాట్యం, సుప్రజ బృందం కథక్ నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

